# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- బీహార్ 'రాష్ట్ర అవతరణ' దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.
- మానవ మనుగడకు జీవనాధారమైన నీటిని భవిష్యత్ తరాల కోసం రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పష్టం చేశారు.
- కేంద్ర ప్రభుత్వం నీటి సంరక్షణను ఒక సామూహిక ఉద్యమంగా మార్చిందని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ పేర్కొన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30న ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పురాతన కాలం నుంచి జ్ఞానం, అభివృద్ధికి బీహార్ నిలయంగా ఉందని రాష్ట్రపతి సామాజిక మధ్యమంలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు తమ ప్రతిభ, దృఢ సంకల్పం, కృషి ద్వారా అభివృద్ధి చెందిన బీహార్ తో పాటు, సంపన్న భారతదేశాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.
ఎందరో వీరులు, గొప్ప వ్యక్తులు పుట్టిన బీహార్ రాష్ట్రం దేశం గర్వించేలా అభివృద్ధివైపు అడుగులు వేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. రాష్ట్ర పురోగతిలో కష్టపడి పనిచేసే ప్రతిభావంతులైన ప్రజలు.. కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు కేంద్రమైన బీహార్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీటి సంరక్షణ, స్థిరమైన జలవనరుల అభివృద్ధిని ప్రోత్సహించడం వంటి ప్రభుత్వ చర్యలు నీటి పట్ల దేశ నిబద్ధతను సూచిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పునరుద్ఘాటించారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నీటి సంరక్షణ ప్రాముఖ్యతను వివరించే వీడియో సందేశాన్ని ఈరోజు ఆయన సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ఈ సందర్భంగా మానవ మనుగడకు నీరు జీవనాధారమని, భవిష్యత్ తరాల కోసం దానిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం నీటి సంరక్షణను ఒక సామూహిక ఉద్యమంగా మార్చిందని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఈరోజు దేశవ్యాప్తంగా జల్ శక్తి అభియాన్, క్యాచ్ ది రెయిన్-2025 కార్యక్రమాన్ని హర్యానాలోని పంచకులలో తౌదేవి లాల్ స్టేడియం నుండి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జల్ జీవన్ మిషన్ కింద ప్రభుత్వం కోట్లాది గృహాలకు కుళాయి నీటిని అందించిందన్నారు. అటల్ భూగర్భ జల పథకం నీటి మట్టంపై అవగాహన పెంచిందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్..34 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 2024 ఏడాదికి సంబంధించి జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ ఈ మేరకు ఈరోజు ప్రకటన విడుదల చేసింది. ఛత్తీస్‌ఘఢ్ నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న మొదటి రచయితగా శుక్లా నిలిచారు. భారతీయ సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 'జ్ఞానపీఠ్ అవార్డు'ను అందజేస్తారు. హిందీ సాహిత్యం, విలక్షణమైన రచనా శైలికి ఆయన చేసిన కృషికి గాను ఈ అవార్డు లభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత 10 సంవత్సరాలలో భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (GDP) 105 శాతం వృద్ధితో రెట్టింపు అయ్యిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) వెల్లడించింది. 2015లో 2.1 ట్రిలియన్ డాలర్లగా ఉన్న స్థూల దేశీయోత్పత్తి 2025 నాటికి 4.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని తెలిపింది. భారతదేశం ఇప్పుడు ప్రపంచంలో GDP పరంగా ఐదవ అతిపెద్ద దేశంగా ఉందని, త్వరలో జపాన్‌ను అధిగమించనుందని IMF పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు మద్దతు కొనసాగిస్తామని ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ మరోసారి వెల్లడించారు. ఉత్తరకొరియా రాజధాని పాంగ్యాంగ్‌లో రష్యా రక్షణ రంగానికి చెందిన ఉన్నతస్థాయి సమావేశంలో కిమ్, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ సెర్గీ షోయిగు వివిధ అంశాలపై చర్చించారు. రష్యా తన సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతను కాపాడుకునేందుకు చేస్తోన్న పోరాటంలో తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని కిమ్ స్పష్టంచేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (PLI) పథకాల కింద ఇప్పటివరకు 14 కీలక రంగాలకు సంబంధించి 764 దరఖాస్తులు ఆమోదించబడ్డాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పథకం కింద బల్క్ డ్రగ్స్, వైద్య పరికరాలు, ఫార్మా, టెలికాం, వైట్ గూడ్స్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, డ్రోన్‌లు వంటి రంగాలతో పాటు 176 చిన్న మధ్య తరహా లబ్ధిదారులు ఉన్నారని తెలిపింది. గత సంవత్సరం నవంబర్ వరకు పిఎల్ఐ పథకంతో సుమారు 1.61 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి నమోదైందని, దాదాపు 14 లక్షల కోట్ల రూపాయల ఉత్పత్తి, అమ్మకాలు జరిగాయని తెలిపింది. అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగాను 11.5 లక్షల ఉద్యోగాలు లభించాయని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ (IPL) 2025 ఈరోజు ఘనంగా ప్రారంభమైంది. కలకత్తాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో రాత్రి 7.30 గంటలకు కోల్ కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య తొలి మ్యాచ్ ప్రారంభమైంది. మొత్తం 74 మ్యాచ్‌లలో 10 జట్లు పోటీపడే ఈ టోర్నమెంట్ మే 25న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు భారతదేశంలో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్, మధ్య మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, సిక్కిం, బీహార్, జార్ఖండ్, ఒడిశాలలో రాగల 24 గంటలలో  ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరామ్, త్రిపురలలో రాబోయే నాలుగు రోజులు ఈ పరిస్థితులు కొనసాగుతాయని పేర్కొంది.
అలాగే దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, లక్షద్వీప్, కోస్తా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలోని రానున్న 4 రోజులు పలు  ప్రాంతాలలో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తూర్పు భారతదేశంలో రాబోయే మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 3 నుండి 4 డిగ్రీల సెల్సియస్ కు తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడిస్తూ...

(వాయిస్..32 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =